# విసుర్రాయి

సక్కుబాయి తెల్లవారుజామున నాలుగ్గంటలకు లేస్తుంది. మొదట ఇంట్లోకి కావల సిన నీళ్ళు పట్టి పెడ్తుంది. ఆరింటికే నల్లాలు బందయితాయి. అప్పటికి పిల్లలు భర్త ఎవరూ లేవరు. వంటింట్లో వంటకు తాగడానికే కాక అందరి స్నానాలకు బట్టలుతకడానికి అన్ని అవ సరాలకు కావలసిన నీళ్ళు పట్టిపెడ్తుంది సక్కు. తర్వాత అంట్ల గిన్నెలు తోమి వంటకు ప్రక్రమిస్తుంది. ఆరోజుక్కావల్సిన కూరగాయలు ముందురోజు సాయంత్రమే కొనిపెడ్తుంది. పిల్లలు స్కూళ్ళకు తొందరగానే వెళ్ళిపోతారు. స్కూలు బస్సు వచ్చేసరికి వాళ్ళు బస్సుస్టాపులో వుండాలి. లేకపోతే స్కూలు బస్సు వెళ్ళిపోతుంది. వాళ్ళకు స్కూలు బంద్ ఆరోజు.

పిల్లలిద్దరు ఇంట్లో అన్నం తిని రొట్టెలు టిఫిన్‌లో తీసికెళ్తారు. అందుకని అన్నం చారు కూరలు వండాలి. రొట్టెలు చేయాలి. అన్నం తిని అన్నమే టిఫిన్‌లో తీసికెళ్లండి అంటే చిన్నది రాగిణి "అమ్మా మళ్ళీ అన్నమేనా?" అంటుంది. ముఖమదోలా పెట్టి.

సక్కు ముగ్గురి పిల్లల్లో చిన్నవాడు సురేష్. వాడు "ఎప్పుడూ రొట్టెలేనా?" అంటాడు ముక్కు విరిచి.

"అమ్మా! నా ఫ్రెండ్సు రోజుకో రకం తెచ్చుకుంటారమ్మా! ఉప్మా పూరీ బాంబీనో న్యూడెల్స్ - అట్లా రోజుకో రకం తెచ్చుకుంటారు! ఎప్పుడూ రొట్టెలేనా?" అంటాడు. అలుగుతాడు. ఆ మాటలు రాగిణి అనదు కాని దాని మనస్సులో కూడా అదే వుంటుంది.

భర్త ప్రతినెలా ఖర్చుకోసం ఇచ్చే డబ్బులోంచి పిల్లల కోరికలు తీర్చడం సక్కుకు సాధ్యం కావడం లేదు. పిల్లల మాటలు వాళ్ళ కోరికలు వింటే ఆమె మనస్సు బాధపడ్తుంది. కాని ఏం చేయ లేకపోతుంది. ఎప్పుడైనా మార్పు కోసమని పులిహోర చేసి పెడ్తుంది టిఫిన్‌లో.

ముగ్గురిలో పెద్దది రజిత. ఇంటర్‌లో చేరింది. పొద్దున్నే ఆరుగంటలకే కోచింగుకని

వెళ్ళి పోతుంది. అక్కడ్నుంచే కాలేజికి వెళ్ళి అలసిపోయి మూడు గంటలకు ఇంటికి వస్తుంది. ఇంట్లో సక్కుకు ఆసరాగా ఏమైనా పనిచేస్తుందా అంటే దానికి సమయమే వుండదు. వున్నా అలసిపోయి వస్తుంది. హోం వర్కు చేసుకోవాలని అంటుంది. పరీక్ష వుంది చదువుకోవా లంటుంది. దాంతో సక్కుకు కూతురు కేం పని చెప్పబుద్ధి కాదు.

"పాపం! దాని మెడకు చదువే వుంది. పనేం చెప్పను!" అనుకుంటుంది.

రజిత కాలేజి నుంచి నీరసంగా వస్తుంది. టిఫిన్ తీసికెళ్ళమంటే అయిష్టంగా ఓసారి తీసుకెళ్తుంది. ఓసారి టిఫిన్ ఇంట్లోనే పెట్టి వెళ్ళిపోతుంది. "అమ్మా ! నా ఫ్రెండ్సు రోజు డబ్బు తెచ్చుకొని హాయిగా టిఫిన్ సెంటర్లో తింటారు. నాకే ఈ టిఫిన్ డబ్బాలు మోయడం! కాస్త నువ్వే చూడమ్మా! ఈ పుస్తకాల బ్యాగు ఎంత బరువుగా వుందో! ఇంత టిఫిన్ ఎక్కడ మోసుకుపోను!" అంటుంది రజిత చిరుకోపం ప్రదర్శిస్తు. "రజితా! నీకు తెలుసు గదమ్మా! మీ నాన్నగారిచ్చే డబ్బు ఇంటి ఖర్చుకే బొటాబొటీగా సరిపోతుంది. ఇక రోజు నీకు టిఫిన్ డబ్బులు ఎక్కడి నుంచి ఇయ్యాలి తల్లీ! ఏదో సర్దుకుపోవడం నేర్చుకోవాలి తల్లీ!" అని సక్కు రజితను సముదాయించింది.

ఒకసారి రజితను టిఫిన్ కోసం డబ్బు తండ్రినడగమంది సక్కు.

"అమ్మో! నాన్నను డబ్బు అడిగి లాభం లేదమ్మా! నీకు తెలియదా? పైగా కోపంతో పొదుపుగా ఎట్లా ఖర్చుపెట్టాలో లెక్చరిస్తాడు. ఆయనకు మాత్రం స్నేహితుల్తో పేకాడడానికి తాగడానికి మాత్రం డబ్బు పుష్కలంగా వుంటుంది" కోపంగా అంది రజిత. అది ఇప్పుడు పెద్దదయింది. తండ్రి డబ్బంతా దేనికి ఖర్చు చేస్తున్నాడో తెలుస్తున్నది.

రజిత మాటలు విని సక్కు నిట్టూర్చింది.

"అవన్నీ నీకెందుకు రజిత! సరే! ఇదిగో ఈ డబ్బు తీసుకో. ఈరోజు టిఫిన్‌కు నీకోసం పూరీ అన్నా ఉప్మా అన్నా చేసి ఇకముందు ప్లాస్టిక్ కవర్లో పెట్టిస్తాను సరేనా! స్టీలు టిఫినయితే బరువు అంటున్నావు కద!" అంది సక్కు.

"అమ్మా! అది సరే! కాని నాకు ఈనెల ఓ కొత్త డ్రెస్సు కావాలి! లేకపోతే నేనొప్పుకోను. అందరూ రకరకాల డ్రెస్సులు రోజుకో రకం వేసుకొస్తున్నారు కాలేజికి. నేనేమో ఎప్పుడూ ఆ పాతవే నువ్వు ఉతికి గంజిపెట్టినవే రోజూ వేసుకుంటున్నాను. అందరి ముందు నాకెట్లా వుంటుంది. నువ్వే చెప్పమ్మా! మరీ మనమంత లేనివాళ్ళం కాదు కదా! అమ్మా! ఈ నెల ఎట్ల యిన ఒక డ్రెస్సు కొనియ్యవే!" అలిగింది, ప్రాధేయపడింది రజిత.

"నిజమే! లేనివాళ్ళమేం కాదు. ఆయన బాగానే సంపాదిస్తున్నాడు. కానీ ! ఇంటి కర్చుకనీ ఇంత డబ్బు నెలనెల ఇస్తాడంతే! పిల్లల కర్చులిందులోనే. స్కూళ్ళ కాలేజీల ఫీజులు

మాత్రం అడగ్గా అడగ్గా ఇస్తాడు. ఆయనిచ్చే డబ్బుతో ఇంటికర్చు, పిల్లల కోరికలు నెరవేర్చడం సాధ్యం కాదు. పెరుగుతున్న ధరలతో ఆయనిచ్చే డబ్బు ఇంటి కర్చుకే ఇటు సాగదీస్తే అటు సాగదీస్తే సరిపోతున్నది. స్కూలుకెళ్ళే పిల్లలు స్కూలు డ్రెస్సులేసుకుంటున్నారు కాబట్టి వాళ్ళతో అంత బాధలేదు. కాని రజిత కాలేజీలో వుంది. అక్కడ పిల్లలు రకరకాల ఫ్యాషన్లతో బట్టలేసుకొని వస్తారు. నాకు తెలుసు! కానీ! నేనేం చేయాలి!" అనుకుంది సక్కు మనస్సులో. పైకి నిట్టూర్చింది.

"రజిత డ్రెస్సు కొనుక్కుంటానని డబ్బు మీ నాన్ననడుగు". అంది సక్కు.

"ఆఁ- అయినట్లే! నాన్ననడిగితే ఇయ్యడు. పైగా కాలేజీ కూడా మానెయ్యమన్నా అంటాడు. నువ్వేమో నాన్ననడుగమని తప్పించుకుంటావు. నాకేం వద్దులే కొత్త డ్రెస్సు" రెండు పెదవులు బిగించి మూతి సాగదీసింది రజిత కోపంగా. ఇంకోవైపు రజిత కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి.

సక్కు రజిత ముఖాన్ని తన మునివేళ్ళతో పట్టి తనవైపు తిప్పుకొని ఇంకో చేత్తో దగ్గరికి తీసుకుంది. రజిత కాస్సేపు తల్లి దగ్గరికి చేరక బిగుసుకపోయింది. సక్కు రజితను గట్టిగా గుంజి తన గుండెకదుముకుంది.

"రజిత! కొత్త డ్రెస్సు కొంటానులే! నువ్వయితే బాధపడకుండా యీ రోజు కాలేజికి వెళ్ళు!" అంది సక్కు వాత్సల్యం కుమ్మరిస్తు.

తల్లి మాటలకు వాత్సల్యానికి రజిత ముఖం వెంటనే ఆనందంతో వెలిగిపోయింది. దుఃఖ బాష్పాలు ఆనందబాష్పాలుగా మారాయి. "అమ్మా! తప్పకుండా కొనిస్తావు కదా!" అని ఎగిరి గంతేసి తన పుస్తకాల బ్యాగు తీసుకుంది. కాలేజీకి బయలుదేరింది.

రిక్తవాగ్దానం చేస్తున్నందుకు సక్కుకు బాధగా వుంది. కాని కూతురును ఇప్పుడు సముదాయించి కాలేజీకి పంపాలంటే గత్యంతరం లేదు. "చూద్దాం! భర్తనెట్లా అయినా ఒప్పించి కొత్త డ్రెస్సు కొనిపెట్టాలి దానికి!" అనుకుంది సక్కు.

పిల్లలు స్కూలుకెళ్ళిపోయిం తర్వాత మెల్లగా ఎనిమిది గంటలకు లేస్తాడు సక్కు భర్త సుబ్బారావు. లేవగానే ఆయనకు టూత్‌బ్రష్ మీద పేస్టుతో సిద్ధంగా ఉండాలి. బాత్‌రూంలో బకెట్ల నిండా నీళ్ళుండాలి. వాష్‌బేసిన్ మీద మగ్గునిండా నీళ్లుండాలి.

నీళ్ళ కరువుతో సక్కుకు కష్టంగానే వుంది. ఏడాదిలో ఏ నాలుగు నెలలో నీళ్ళు పుష్కలంగా వున్నప్పుడే కింద ఇంటి యజమానులు మోటరు వేసి పైకి వదుల్తారు. నీళ్ళు తక్కువైనప్పుడు నీళ్ళు ఆదా చేయాలనే దృష్టితో కిందికి వచ్చి నీళ్ళు మోసుకుపొమ్మంటారు. కింద మున్సిపల్ నీళ్ళు వచ్చినప్పుడు వేస్టు కాకుండా నిండేందుకు ఇంటివాళ్ళు ఒక సంపు

కట్టించారు. ఆ సంపులోంచే సక్కు నీళ్ళు చేదుకొని బకెట్లల్లో నింపుకొని పైకి మోస్తుంది. సెలవు రోజుల్లో అయితే పిల్లలు సాయం చేస్తారు. మిగతా రోజుల్లో పిల్లలు స్కూలు కాలేజీకి వెళ్ళే తొందరలో వుంటారు. సక్కు ఒక్కతే నీళ్ళు పైకి మోసుకొస్తుంది. పొద్దున్నే సక్కు చేసే మొదటిపని అదే. పది బకెట్ల దాకనైనా పైకి నీళ్ళు మోస్తుంది. తర్వాత గిన్నెలు తోమి వంట మొదలుపెడ్తుంది.

ఇంటి కిరాయి తక్కువ అందులో పిల్లలకు స్కూలు, కాలేజీలకు దగ్గరగా ఉంది. అయినా నీళ్ళ వసతి చూసుకుంటే కిరాయి ఎక్కువ ఇయ్యాల్సి వుంటుంది. అది భర్తకు ఇష్టంలేదు. పిల్లలు వెళ్ళిపోగానే సక్కు దబదబా కిందికి వెళ్ళి మళ్ళీ బకెట్లతో నీళ్ళు తెచ్చి బాత్‌రూంలో పెడ్తుంది.

సుబ్బారావు నిద్ర నుంచి లేచి చక్కంగా బాత్‌రూంలోకి వెళ్తాడు. పళ్ళు తోముకోవడం స్నానం చేయడం వగైరా అయినాక గంటకు కాని బయటికి రాడు.

★ ★ ★

ఒకసారి సక్కుకు బాగా జ్వరం వచ్చి పడక మీద నుంచి ఎంత ప్రయత్నం చేసినా లేవలేక పోయింది. ఆమెకు అంతకు ముందే వారం రోజుల నుంచి జ్వరం వస్తున్నా క్రోసిన్ వేసుకొని పనులు చేసుకుంటూ పోతున్నది. అది క్రోసిన్‌తో తగ్గే జ్వరం కాదు. ఆరోజు రాత్రి ఆమెకు హై ఫీవరు తలనొప్పి ఒళ్ళు నొప్పులు చలి వచ్చాయి. దాంతో ఆమె పొద్దున్నే ఎంత ప్రయత్నించినా పక్క మీది నుంచి లేవలేకపోయింది. రాత్రి అన్నం వుంటే పిల్లలు పెరుగు పోసుకొని తిని వెళ్ళిపోయారు. మధ్యాహ్నం టిఫిన్‌కు వాళ్ళ చేతిలో డబ్బు పెట్టింది. దాంతో వాళ్ళు సంతోషంగా వెళ్ళిపోయారు.

పిల్లలు వెళ్ళిపోయింతర్వాత యధావిధిగా సుబ్బారావు నిద్ర నుంచి లేచాడు. సక్కు జ్వరంతో స్పృహ లేకుండా పడకలో వుంది. సుబ్బారావు లేచి చక్కగా బాత్‌రూంలోకి వెళ్ళాడు. షాక్ తిన్నవాడిలా అరిచాడు.

"ఏమే! ఎక్కడ చచ్చావే! బాత్‌రూంలో నీళ్ళు లేవేమిటి! చాతగాని ముండ! ఏ పనీ వేళకు చేసి చావదు. తినడం తిరగడం కబుర్లు చెప్పడం తప్ప ఏ పనీ చాతకాదు. చచ్చుముండ! అందులో దీనికో ఫ్రెండు క్రాంతి జతయింది. ఎందుకే యీ బానిస బతుకు అని నూరిపోస్తుంది అది! దాన్ని ఇంటికి రాకుండా చేయాలి! అప్పుడుగాని దీని రోగం కుదరదు!" అని అరుపు నుంచి స్వగతంలోకి వెళ్లాడు. మళ్ళా బకెటు వైపు చూసేసరికి సుబ్బారావుకు కోపం నడినెత్తి కంటింది.

"ఏమే! ఎక్కడ చచ్చావు?" అని కేకేసాడు సుబ్బారావు.

భర్త కేకలకు సక్కు కాస్త స్పృహలోకి వచ్చింది.

"ఊఁ" అని మూల్గింది. పక్కలోంచి లేవబోయింది కాని లేవలేకపోయింది.

"ఇక ఈరోజు నా గతి ఇంతే! బానిస లాగా నీళ్ళు మోయవల్సిందే" అని అంటూ బకెటుతో సుబ్బారావు కిందికి వెళ్ళాడు.

ఎదురుగా చాయ్ తాగుతూ ఇంటి యజమాని కన్పించాడు.

"ఏమి సుబ్బారావు! ఈరోజు నువ్వు బకెటు పట్టుకొని బయల్దేరావు! మీ ఆవిడేమైంది!' ' అని అడిగాడు.

"చచ్చు ప్రశ్న!" అని అనుకున్నాడు మాట్లాడలేదు సుబ్బారావు. అతనికి కోపం ముక్కు మీద నాట్యమాడింది. ముక్కంతా ఎర్రబడింది. దాంతో చెవులూ ఎర్రబడ్డాయి. సుబ్బారావు ఎర్రగా బుర్రగా వుంటాడు. దానికితోడు ఎప్పుడూ ఎండ పడకుండా చూసుకుంటాడు. ఉబ్బి పోయిన ముఖంతో సుబ్బారావు ఏం జవాబు చెప్పకుండా బకెటు నీళ్ళు తీసుకొని పైకి వచ్చాడు. ఆ బకెటు నీళ్ళతోనే ముఖం కడుక్కొని స్నానం చేసాడు. రోజు మూడు బకెట్ల నీళ్ళు ఖతం చేసేవాడు. ఈరోజు ఒక్క బకెటుతోనే సరిపుచ్చుకున్నాడు.

సుబ్బారావు సెంటు వాసన కొడుతున్న నూనెను నెత్తికి రాసుకొని వెంట్రుకలు దువ్వుకొని ముఖానికి పౌడరు రాసుకొని ఆఫీసుకు తయారయ్యాడు. "ఈరోజు ఆఫీసుకు లేటయ్యేటట్లుగా వుంది. ఇంకా హోటల్లో టిఫిన్ చేయాలి!" అని అనుకుంటూ హడావిడిగా సుబ్బారావు సక్కు పడక దగ్గరికి వచ్చాడు.

"నేను బయట టిఫిన్ చేసి ఛస్తాను. పడుకో! ఎన్ని రోజులు పడుకుంటావు! నీదేం పోతుంది!" అని సుబ్బారావు వెళ్ళిపోయాడు.

సక్కు జ్వరం ఎట్లా వుంది మందు వేసుకుందా లేదా? డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాలా లేదా? ఏదీ అడక్కుండానే సుబ్బారావు వెళ్ళిపోయాడు.

సక్కు ఒళ్ళు జ్వరంతో కాలిపోతుంది. పొద్దుట్నుంచి ఆమెను చాయ్ తాగు అని అడిగే దిక్కు కూడా లేదు.

"నేనిట్లా పడుకుంటే పాపం! అత్తగారు" అనుకుంది సక్కు.

మధ్యాహ్నం కల్లా సక్కు ఓపిక తెచ్చుకొని పక్కలో నుంచి లేచింది. పిల్లలు భర్త వెళ్ళి పోయింతర్వాత నీళ్ళు పైకి మోసుకొచ్చాక సక్కు అత్తగారి దగ్గరికి వెళ్తుంది. ఆమె ఎనభై పైపడిన వృద్ధురాలు. పక్కకే అంటుకపోయి ఉంటుంది. పొద్దున మాత్రం లేచి బాత్‌రూం కెళ్ళడం, ముఖం కడుక్కోవడం చేసుకుంటుంది. సక్కు అత్తగారికి భోజనం తీసుకెళ్ళి తిన్నదాకా దగ్గరుంటుంది. ఈరోజు తను లేవకపోతే ఆమెకు ఉపవాసమే! అని అనుకొని సక్కు

వంటింట్లోకి వెళ్ళి బియ్యం పొయ్యి మీద వేసి పచ్చి పులుసు చేసింది. రాత్రి పెరుగు పిల్లలు ఖతం చేసారు. పచ్చి పులుసుతోనే అత్తగారికి భోజనం పెట్టింది సక్కు. అత్తగారు మంచంలో కూర్చుని ముందున్న స్టూలు మీద పెట్టిన అన్నాన్ని నిర్వికారంగా మెల్లగా తిన్నది. తిన్నదాకా సక్కు అక్కడే నేలమీద కూర్చుంది. ఆమె తిన్నాక మంచి నీళ్ళు తాగించింది.

అత్తగారు పడుకున్నాక సక్కు ఇంటి కిందనే వీధిలో వున్న హోమియోపతి డాక్టరు దగ్గరికి వెళ్ళింది. ఇప్పుడు అలోపతి డాక్టరుకు చూపిస్తే లాభంలేదు. ఫీజే యాభై తీసుకుంటాడు. ఆ టెస్టులు ఈ టెస్టులంటాడు. తర్వాత నాలుగైదు రకాల మందులు రాసిస్తాడు. మందులకూ బోలెడు డబ్బు! యాంటీబయాటిక్ రాస్తే ఇక చెప్పనే అక్కర్లేదు. చాలా ఖర్చవుతుంది. హోమియోపతే మేలు! అని సక్కు హోమియోపతి డాక్టరు దగ్గరికి వెళ్ళింది. అక్కడా బోలెడుమంది వున్నారు. ఓపిగ్గా తన వంతు వచ్చేదాకా సక్కు బెంచీ మీద కూర్చుంది.

హోమియోపతి డాక్టరు యాభై రూపాయలు ఫీజు తీసుకున్నాడు. కాని ఒకటేమిటంటే టెస్టుల్లేవు. మందు ఆయనే ఇచ్చాడు. ఇంటికి వచ్చాక ఒక పొట్లంలోని మందు వేసుకుంది సక్కు. పడుకుంది. అర్ధగంటలో ఒళ్లంతా చెమటలు పట్టాయి. జ్వరం జారింది వెంటనే. జ్వరం జారగానే నీరసంగా అనిపించిందామెకు. లేచి పచ్చి పులుసు పోసుకొని అన్నం తిన్నది. నోరు రుచి లేకుండా అయింది. "అయినా తినకపోతే మరీ నీరసం వచ్చేస్తుంది!" అని బలవంతంగా నాలుగు ముద్దలు మింగింది. పడుకుంది. లేచాక మళ్ళీ ఓ పొట్లం మందు వేసుకుంది. అప్పుడు కాస్త నీరసం తగ్గినట్లని పించింది. పిల్లలు స్కూలు నుంచి వచ్చే వేళవు తుంది. రజిత వస్తుంది ఆకలితో అని సక్కు వంటకుపక్రమించింది. సక్కుకు జ్వరం వచ్చినా ఎక్కువకాలం వుండదని ఇంట్లో అందరికీ తెలుసు!

★ ★ ★

సుబ్బారావు గంటసేపయినాక బాత్‌రూంలో నుంచి బయటికి వచ్చాడు. చక్కగా సెంటు వాసనలు వెదజల్లుతున్న నూనెను నెత్తికి రాసుకొని వెంట్రుకలు దువ్వుకున్నాడు. ముఖానికి పౌడరు రాసుకున్నాడు. వచ్చి పేపరు చదువుతూ కుర్చీలో కూర్చున్నాడు. వెంటనే సక్కు అతనికి వేడివేడి చాయ్ మగ్గు తెచ్చి అందించింది. చాయ్ తాగుతూ కాస్సేపు సుబ్బారావు పేపరు తిరగేసాడు. లేచి డైనింగు టేబిల్ దగ్గరికెళ్ళాడు. సక్కు అన్నం కూర చారు అన్నీ బల్లమీద పెట్టింది. సుబ్బారావుకు అన్నీ వేడిగా పొగలు గక్కుతూ వుండాలి. లేకపోతే తినడు. కాస్త వేడి తక్కువున్నా పళ్ళెం తీసి విసిరికొడ్తాడు. అందుకని భయంగానే సక్కు అన్ని వంటలు వేడి వేడిగా చేసి బల్లమీద పెడ్తుంది. సుబ్బారావు భోజనం చేసి మరోసారి పౌడరు ముఖానికి రాసుకొని ప్యాంటు షర్టు వేసుకుంటాడు. అతని బట్టలను సక్కు ప్రత్యేకంగా ఎక్కడా మురికి

లేకుండా ఉతికి ఇస్త్రీ చేయించి పెడ్తుంది. ఎక్కడ కాస్త మురికి గాని మడతగాని కన్పించినా ఆరోజు రాద్ధాంతమే. సుబ్బారావు బట్టలేసుకొని మరోసారి ముఖానిక పౌడరు రాసుకొని అర్రలో తనకున్న చిన్న తనబ్బీకి తాళం వేసుకొని ఆఫీసుకు బయలుదేరుతాడు.

సుబ్బారావు తనబ్బీకి తాళం వేసుకుంటుండగా సక్కు అర్రలోకి వచ్చింది.

"ఏవండి!" అంది.

సుబ్బారావు వెనుకకు తిరుగలేదు. ఊ అనలేదు. అయినా సక్కు మళ్ళీ మొదలు పెట్టింది.

"ఏవండీ! దసరా వస్తుంది గదా! పిల్లలు కొత్త బట్టలు కావాలంటున్నారు" అంది సక్కు మెల్లగా భయంభయంగా.

"పిల్లలే అడుగుతున్నారా? నీకొద్దా?" అడిగాడు సుబ్బారావు. అతని ముఖం మీద చిరునవ్వు కన్పించింది. అతని చిరునవ్వును అపార్థం చేసుకుంది సక్కు.

"నాక్కూడా చీర - చీరలు చినిగిపోయాయి. అవే కుట్టుకొని కట్టుకుంటున్నాను" అంది ఆశగా సక్కు. "అంతేనా? ఇంకా పట్టుచీరలేమైనా కావాలా?" వెటకారంగా చిరునవ్వుతో అడిగాడు సుబ్బారావు. అతని ముఖం మీద ఏదో వికారమైన వెలుగు.

అతని ముఖం చూసిం తర్వాత ఆమెకు అతని ఉద్దేశ్యమర్థమైంది. ఆమెకు కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వెనుకకు గిరుక్కున తిరిగి వంటింట్లోకి వెళ్ళి పైటకొంగుతో కళ్ళు తుడుచు కుంది. ఆ ఇంట్లో ఆమెకు ఊరటనిచ్చే స్థలం వంటిల్లే! దబదబ పనిలో మునిగిపోయింది. భర్తకు టిఫిన్ డబ్బాలో పెట్టి తీసుకెళ్ళి అతని చేతికిచ్చింది.

"టిఫిన్‌లోకి ఏం ఎట్టావ్? అన్నంలోకి ఒక్కటే కూర చేసావ్? పప్పులేదు. ఖర్చుకని ఇచ్చే డబ్బు ఏం చేస్తున్నావ్? మిగిల్చి మూటకడ్తున్నావా?" అడిగాడు సుబ్బారావు. అతని గొంతులో కాఠిన్యం వుంది.

"పప్పు, చింతపండు నిండుకున్నాయండి. వచ్చేటప్పుడు తీసుకరండి" అంది సక్కు ధైర్యం చేసి.

"ఏం? నెలకు ఇంటిఖర్చుకని డబ్బు ఇచ్చాను గదా! మళ్ళీ పప్పుతే! ఉప్పుతే! అంటే ఎక్కడ్నుంచి తెస్తాను!" కోపంతో వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావుకు జీతం బాగానే వస్తుంది. మీది ఆదాయం కూడా వుందంటారు. కాని నెల రాగానే ఫస్టుకే సుబ్బారావు రెండువేలు తెచ్చి భార్యకిస్తాడు. ఏ ఖర్చు వచ్చినా మళ్ళీ ఒక్క పైసా ఇయ్యడు. ఈ కరువు కాలానికి ఆకాశాన్నంటే ధరలతో రెండువేలు తిండి ఖర్చులకే సరిపోవడం లేదు. ఇక స్నానం సబ్బులు బట్టల సబ్బులు టూత్‌పేస్టులు వగైరా వగైరా

వస్తువుల ధరలు ప్రతినెలా పెరుగుతూనే వున్నాయి. రెండువేలు ఏ మూలకు సరిపోవడంలేదు. మళ్ళీ అన్నంలోకి సుబ్బారావుకు పప్పు, చారు, రెండు కూరలుండాలంటాడు. టిఫిన్ బాగుండాలంటాడు. ఏది తక్కువయినా ఆరోజు గొడవే!

ఇంటి ఖర్చుకు రెండువేలు ఇచ్చి మిగతా డబ్బు పి.ఎఫ్.లో వేస్తున్నానంటాడు సుబ్బారావు. నిజానికి సుబ్బారావు స్వంత ఖర్చు ఎక్కువ. ఖరీదైన సబ్బులు నూనెలు షేవింగు క్రీములు బ్లేడులు ఏమేమో తెచ్చుకొని అర్రలోని తనబ్బీలో పెట్టుకొని తాళం వేసుకుంటాడు. ఆ తనబ్బి ఆయన స్వంతం. అందులో ఏముంటాయో ఎవరూ చూడ్డానికి వీల్లేదు. ఎప్పుడూ తాళం ఉంటుంది. తాళంచెవి సుబ్బారావు దగ్గర ఉంటుంది. మంచి ఖరీదైన లేటెస్టుగా వచ్చిన బట్టలు కొని షర్టులు ప్యాంటులు ఇంట్లో వేసుకోడానికి లాగులు లాల్చీలు కుట్టించుకుంటాడు. అవన్నీ ఇంకా ఉతికి ఇస్త్రీ అయిన బట్టలన్నీ తనబ్బీలోకి చేరుతాయి. ఇంట్లోవాళ్ళు ఏ పాతబట్టలో తువ్వాలుగా ఉపయోగించుకుంటే ఆయన అందమైన తువ్వాలును వాడుతాడు. అతని తువ్వాలను ఎవరూ ముట్టుకోడానికి వీల్లేదు. లేటెస్టు చెప్పుల జతలు కొనుక్కుంటాడు. వాటికి దుమ్ము అంటకుండా చూసుకుంటాడు. ఖరీదైన వాచీ చేతికి, వేళ్ళకు రాళ్ళ ఉంగరాలు. ఇవన్నీ పోగా సుబ్బారావుకు స్నేహితులతో పేకాడడం, తాగడం వంటి అలవాట్లు కూడా వున్నాయి. ఏరోజూ అతడు ఆఫీసు అయిపోగానే ఇంటికి రాడు. ఏ హోటల్లోనో ఏ స్నేహితు లింట్లోనో తాగి పేకాడి ఇంటికి ఆలస్యంగా వస్తాడు రోజు. తనకోసం ఖర్చు పెట్టుకోడానికి సుబ్బారావు ఎప్పుడూ వెనుకాడడు.

సుబ్బారావు సక్కు ఇచ్చిన టిఫిన్ డబ్బాను అందమైన లెదరు బ్యాగులో వేసుకొని ఆఫీసుకు బయలుదేరాడు.

అత్తగారు భోం చేసింతర్వాత ఆమెను పడుకోబెట్టి అప్పుడు సక్కు బట్టలుతికి వంటగిన్నెలు తోమి తను స్నానం చేసి భోంచేస్తుంది. అప్పటికి సక్కు ఒళ్ళంతా హూనమై వుంటుంది. డబ్బు కర్చవుతుందని సక్కు పనిమనిషిని పెట్టుకోలేదు. పనిమనిషికని భర్తను అదనంగా ఓసారి అడిగితే-

"నువ్వు ఇంట్లోనే వుంటున్నావు గదా! ఉద్యోగమా సద్యోగమా? నీకింక పనిమనిషి ఎందుకు?" అన్నాడు.

మధ్యాహ్నం సక్కు కాస్త నడుం వాలుద్దామని అనుకుంటె అత్తగారు పిలుస్తుంది. ఆమెకు మందో మంచినీళ్ళో ఇచ్చేసరికి మూడుగంటలకు రజిత వస్తుంది. అది భోంచేయగానే స్కూలు నుంచి రాగిణి సురేష్‌లు వస్తారు. వాళ్ళను బట్టలు మార్చుకొమ్మని ఏదైనా తినడానికి వాళ్ళకు పెట్టి మరుసటి రోజుకని వాళ్ళ స్కూలు బట్టలుతికి వాళ్ళను హోం వర్కు చేయమని

వెంటపడ్తుంది. వాళ్ళు బలవంతంగా పుస్తకాలు ముందేసి కూర్చోబెట్టందే కూచోరు. హోమ్ వర్కులో వాళ్ళకు సాయం చేస్తుంది. మరునాటికి కావల్సిన కూరలు నారలు కొని తెచ్చేసరికి రాత్రి వంటకు టైమవుతుంది.

రజిత మధ్యాహ్నం భోంచేసి సాయంత్రం ట్యూషనుకెళ్ళి వచ్చేసరికి ఏడవుతుంది. "ఇంత చీకటి పడింతర్వాత ఒక్కదానివే రాకే! ట్యూషన్ నుంచి తొందరగా రా!" అంటుంది సక్కు ఏదేదో ఊహించుకొని ఆందోళనతో.

ఆ మాటలు విని రజితకు కోపం వస్తుంది. "ఏంటమ్మా! నేనొక్కతెనే వున్నానా ట్యూషన్లో. ఎంతమంది ఆడపిల్లలు ట్యూషన్ తర్వాత ఇండ్లకు వెళ్ళడంలేదు. అయినా నేను ఓ లూనా కొనిపెట్టమని ఎప్పట్నుంచో అడుగుతున్నాను. అందరూ లూనాల మీద కెనెటిక్‌ల మీద వస్తారు. హాయిగా బుర్రుమని వెళ్ళిపోతారు. నేను బస్సులో పడిరావాలి!" అంటుంది రజిత కోపంగా బుంగమూతి పెట్టి. పరిస్థితి తెలిసినా రజిత కోరికలు ప్రకటించకుండా వుండదు. సక్కు నిట్టూర్పు విడువడం తప్ప ఏమీ చెప్పలేదు చేయలేదు.

రజిత రాగానే ముగ్గురికీ ఒకేసారి భోజనం పెట్టేస్తుంది సక్కు. భోజనాల తర్వాత వాళ్ళు చదువుకుంటుంటె అత్తగారిని లేపి ఆమెకు భోజనం పెడ్తుంది. రోజంతా కూడా సక్కు అప్పుడప్పుడు వెళ్ళి ఆమెను పలకరిస్తుంది మంచి నీళ్ళు తాపుతుంటుంది. అత్తగారు వేళకు భోజనం పెడ్తే తినడం, మంచినీళ్ళు తాపితే తాగడం తప్ప ఏమీ వినపడదు. మాట్లాడదు. ఏమీ పట్టించుకోదు కూడా. జీవమున్న శవంలా పడి వుంటుందామె. "ఆమెకేం జ్ఞాపకం కూడా వుండదు!" అనుకుంది సక్కు.

సుబ్బారావు అప్పటికీ రాడు. అతనికి రాత్రి భోజనం ఇంట్లో చేయడం అలవాటు లేదు. వస్తూనే అర్రలోకి వెళ్ళి పడుకుంటాడు. అందుకని సక్కు అత్తగారికి భోజనం పెట్టగానే తానూ తింటుంది. గిన్నెలు తోమి వంటిల్లంతా శుభ్రంగా కడుగుతుంది. తర్వాత ఇంట్లో ఓ పాత రేడియో వుంది. అది వింటుంది. సుబ్బారావు టీవీ కొనలేదు. "టీవీ కర్చు కూడా ఎందుకు? పిల్లల చదువులు సాగవు ఆ టీవీతో" అన్నాడు సుబ్బారావు.

"అదీ నిజమే!" అనుకుంది సక్కు. పిల్లలూ చదువులు పరీక్షలని వాళ్ళూ తండ్రిని టీవీ తెమ్మని వేధించలేదు.

పిల్లలు ఓ రాత్రి దాకా చదువుకొని నిద్రపోయారు. వాళ్ళ పక్కనే ఓ చద్దరు పరచుకొని నిద్రపోయింది సక్కు. రోజంతా పనితో అలిసిపోయిన సక్కుకు పడుకోగానే నిద్ర ముంచు కొస్తుంది.

సుబ్బారావు ఆరోజు మరీ పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. రోజులాగానే అతని

దగ్గర విస్కీ కంపు కొడ్తున్నది. చక్కగ నిలబడలేక ఊగిపోతున్నాడు మత్తుతో. వస్తూనే సుబ్బారావు సక్కు దగ్గరికి వచ్చాడు. ఆమెను గిల్లి లేపాడు. గిల్లిన బాధకు ఆమె వెంటనే లేచి కూర్చుంది. ఎదురుగా భర్తను చూసింది.

"అర్రలోకి రావే!" అని సుబ్బారావు అర్రలోకి వెళ్ళాడు.

సక్కు చేసేదేమీ లేక నిద్రమత్తుతో అర్రలోకి వెళ్ళింది.

"ఇప్పుడు భర్త శారీరక వాంఛను తీర్చకపోతే పెద్దగా అరుస్తాడు, తిడ్తాడు, కొడ్తాడు. పిల్లలు లేస్తారు. వాళ్ళ ఏడుపులు, అరుపులు. వాటితో నానా గందరగోళమవుతుంది. ఆయన పిల్లల్ని కొడ్తాడు. అట్లా ఇదివరకెన్నోసార్లు జరిగింది. ఆ గొడవంతా లేకుండా వుండాలంటే తను భర్త దగ్గరికి వెళ్ళవలిసిందే!" అని అనుకుంటూ సక్కు నిశ్శబ్దంగా భర్త దగ్గరికి వెళ్ళింది అతని రాక్షస రతిలో పాల్గొనడానికి.

* * *